ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 8 నవంబరు 2024



ఆధార్ అనుసంధానం తప్పనిసరి

పార్వతీపురంటౌన్/బెలగాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని పార్వతీపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ ఆర్.బాబూరావు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. మన్యం జిల్లాలో సుమారు లక్షా 20 వేల మంది బ్యాంకు అకౌంట్లతో ఆధార్ అనుసంధానం కాలేదన్నారు. జిల్లా పరిధిలోని 445 హెడ్, సబ్, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఆధార్ అనుసంధానానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏనుగుల బెడదతో.. 144 సెక్షన్

పార్వతీపురం పట్టణ సమీపంలో 144 సెక్షన్ అమలవుతోంది. దీనికి గొడవలు కారణం కాదు. ఏనుగుల బెడద నుంచి ప్రజలను రక్షించడానికి అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. నాలుగు ఏనుగులు గ్రామాల్లోకి వచ్చి పంటలను, ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడ పోలీసులు, అటవీశాఖ అధికారులు 144 సెక్షన్ విధించి.. ఆంక్షలు అమలు చేస్తున్నారు.



భామిని మండలం నల్లరాయిగూడ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

- పార్వతీపురం పరిసరాల్లో అమలు
- ప్రాణ నష్టం జరగకుండా అధికారుల చర్యలు
- ప్రజలు సహకరించాలంటున్న అటవీశాఖ

పార్వతీపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు, వారికి మరింత భద్రత కల్పించేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంటుంది. మానవ-జంతు జీవితాలను పరిరక్షించడంతో పాటు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు చర్యలు చేపడుతుంది. దీనికోసం ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అటవీ, పోలీసు శాఖలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం పార్వతీపురం మండలం దిబ్బగుడ్డివలస పరిసరాల్లో ఏడు, భామిని మండలం జామిగూడ, నల్లరాయిగూడ ప్రాంతాల్లో మరో నాలుగు ఏనుగులు సంచరిస్తున్నాయి. నాగావళి నది తీరం దాటుకుని గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోనూ ఆ ఏడు ఏనుగులు సంచరిస్తుండడంతో ఈ ప్రాంతాలవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకప్పుడు తోటలు, పంట పొలాల్లో సంచరించే గజరాజులు ప్రస్తుతం రహదారులు, జనావాసాల్లో తిరుగుతుండ డంతో ప్రజలు హడలెత్తి పోతున్నారు. ఏనుగుల వల్ల జిల్లాలో ఇప్పటి వరకు 13 మంది చనిపోయారు. 2018 నుంచి ఇప్పటి వరకు ఏనుగులతో రూ.13 కోట్లు పంట నష్టం జరిగింది. అవి ఏ ప్రాంతంలో ఎప్పుడు ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. అటవీశాఖాధికా రులతో పాటు ట్రాకర్స్ ఏనుగులను పర్యవేక్షణ చేస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ దురదృష్టవశాత్తూ ఏనుగుల దాడుల్లో ప్రాణ నష్టంతో పాటు భారీగానే పంట నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నష్ట నివారణ కోసం అటవీ, పోలీసు శాఖలు సంయుక్తంగా ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నాయి. తహసీల్దార్ పర్యవేక్షణలో పోలీసులు, రెవెన్యూశాఖ ఈ బాధ్యతను చూసుకుంటున్నాయి. ప్రస్తుతం జిల్లాకేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సిపురం గ్రామానికి చెందిన డి.భానుమూర్తి కొబ్బరి తోటలో ఏనుగులు ఉన్నాయి. అలాగే, భామిని మండలంలోని నల్లరాయిగూడ, పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గజరాజులు సంచరిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

ఏనుగుల విడిది కేంద్రానికి ప్రతిపాదనలు

ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ ప్రసూన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్దిష్ట ప్రాంతాల్లో ఏనుగులను నిలువరించడమే ఈ కేంద్రం లక్ష్యమన్నారు. దీనివల్ల పంట నష్టం, మానవ ప్రాణ నష్టం, గాయాలు, పశువుల మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. 2018 నుంచి ఇప్పటివరకు ఏనుగుల దాడుల్లో దాదాపు రూ.13 కోట్లు పంట నష్టం జరిగినట్టు అంచనా వేశామన్నారు. పెద్దబొండపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అవాంఛనీయ సంఘటనలు దృష్ట్యా ప్రస్తుతం ఏనుగులు ఉన్న చోట 144 సెక్షన్ విధించామన్నారు. భామిని మండలం నల్లరాయిగూడ సమీపంలో ఏనుగుల గుంపు సంచారాన్ని అటవీశాఖ నిశితంగా పరిశీలిస్తుందన్నారు. గ్రామస్థుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రజలు కూడా ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా సహకరించాలని కోరారు.

వసతి గృహాల్లో పర్యవేక్షణ పెంచుతాం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- పి.కోనవలసలో 'పల్లెనిద్ర'



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్

పార్వతీపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో పర్యవేక్షణ పెంచుతామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలను బలో పేతం చేసేందుకు పల్లెనిద్ర కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన సంక్షేమ బాలుర గురుకుల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యా ప్రమాణాలు, మెనూ, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, మరుగు దొడ్ల నిర్వహణ, కిచెన్ గార్డెన్, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నిర్భయంగా తమకు తెలియజేయాలని, వాటి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల రక్తపరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఇ చలపతిరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.రవి, ఎంపీడీవో జనార్దనరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా 30 వసతిగృహాల్లో పల్లెనిద్ర కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలకు గురువారం రాత్రి వెళ్లి బస చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

సజావుగా నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు..

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, ఇందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై జేసీ, సబ్ కలెక్టర్లు, ఈఈలు, తహసీల్దార్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఈ నెల 10న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రచురణ చేసి అందుబాటులో ఉంచుతారు. వాటిపై అభ్యంతరాలను 11, 12 తేదీల్లో సంబంధిత తహసీల్దార్లు స్వీకరిస్తారు. 13న జాబితా సిద్ధం చేస్తారు. వాటిపై కూడా అభ్యంతరాలు ఉంటే 14, 15 తేదీల్లో పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్లు స్వీకరిస్తారు. వీటిపై కూడా అభ్యంతరాలుంటే 18 నుంచి 20వ తేదీ లోగా జలవనరుల శాఖ కమిషనర్ (విజయవాడ)కు తెలియజేయవచ్చు. 20వ తేదీ తుది జాబితా సిద్ధం అవుతుంది. ప్రతి ఓటరు నోటిఫికేషన్ తేదీ నాటికి రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి కలిగి ఉండాలి. పోలింగ్ సమయంలో పాస్‌బుక్, అడంగళ్, వన్-బి తదితర గుర్తింపు పత్రాలతో హాజరుకావాలి. మండలపరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ విషయపై అవగాహన కల్పించాలి' అని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటీడీఏపై నీలినీడలు

సీతంపేట ఐటీడీఏకు ఇన్‌చార్జి పీవోలే దిక్కు అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటి వరకు రెగ్యులర్ పీవోలు కరువయ్యారు. ఒకవేళ రెగ్యులర్ పీవోలను నియమించినా వారం పదిరోజుల్లోనే బదిలీ చేసేస్తున్నారు. గత ఐదు నెలలుగా పూర్తిగా రెగ్యులర్ పీవో లేకపోవడంతో పాలన గాడి తప్పింది. ఇన్‌చార్జితోనే పాలన నెట్టుకొస్తున్నారు. దీంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో గిరిజనులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఇతర అధికారులకు సమస్యలు మొరపెట్టుకుంటున్నా పరిష్కారం కావడం లేదు. నిధులు లేవని ప్రత్యామ్నాయం చూసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ పీవోను నియమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

- రెగ్యులర్ పీవో నియామకంపై తాత్సారం
- ఐదు నెలలుగా ఇన్‌చార్జితోనే కాలయాపన
- వేధిస్తున్న నిధుల కొరత
- పరిష్కారం కాని గిరిజనుల సమస్యలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



సీతంపేటలోని ఐటీడీఏ కార్యాలయం

సీతంపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను నియమించలేదు. ప్రభుత్వం ఏర్పడిన రోజుల వ్యవధిలో ఇక్కడి పీవో రాహుల్‌కుమార్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆ తరువాత రెగ్యులర్ పీవోను నియమించలేదు. దీంతో ఉమ్మడి జిల్లాల్లోని గిరిజనుల సమస్యలు పరిష్కారం కావడం లేదని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. వీటిలో 16 శ్రీకాకుళం జిల్లాలో, 4 పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నాయి. వీటి పరిధిలో 2.19 లక్షల ఆదివాసీలు నివసిస్తున్నారు. వీరికి ఏ సమస్య వచ్చినా మొదట గుర్తొచ్చేది సీతంపేట ఐటీడీఏనే. అలాంటి ఐటీడీఏ ఇప్పుడు రెగ్యులర్ పీవో(ఐఏఎస్) లేక బోసిపోతోంది. పాలకొండ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి పీవోగా కొనసాగుతున్నారు. దీంతో ఇటు రెవెన్యూ శాఖకు, అటు గిరిజనులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిధుల లేమి..

సీతంపేట ఐటీడీఏ నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ఐటీడీఏకు రెగ్యులర్ పీవోలను పూర్తిస్థాయిలో నియమించింది. కానీ, నిధులు కేటాయించడంలో మాత్రం చేతులెత్తేసింది. గిరిజనులకు ఆర్థిక చేయూనిచ్చే పథకాలన్నీ మరుగున పడేసింది. దీంతో గిరిజనులు ఆర్థికంగా వెనుకబడ్డారు. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం పథకాలన్నీ పునరుద్ధరిస్తుందని, దీని ద్వారా తమకు లాభం చేకూరుతుందని మన్యం వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, ఐటీడీఏకు రెగ్యులర్ పీవో లేకపోవడంతో వారి విశ్వాసం సన్నగిల్లుతోంది. ప్రతీ సోమవారం ఐటీడీఏ నిర్వహించే ప్రజా సమస్యల పరి ష్కార వేదికకు గిరిజనుల నుంచి వందల సంఖ్యలో వినతు లు వస్తున్నాయి. వీటిలో నిధుల వ్యయంతో కూడిన నిర్మాణ పనులు, మంచినీటి సమస్య, ఆర్థిక చేయూత అందించాలని కోరుతూ వచ్చిన వినతులే ఎక్కువగా ఉంటున్నాయి. అయితే, ఐటీడీఏలో నిధులు లేవని, ప్రత్యామ్నాయం చూసుకోవాలని అధికారులు చెబుతుండడంతో గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ -మిగతా 8వ పేజీలో..

ఐటీడీఏ తరలిపోనుందా?

సీతంపేట ఐటీడీఏ ఇక్కడి నుంచి శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి తరలిపోతుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. డీడీ కార్యాలయం శ్రీకాకుళం కేంద్రంలో ఉండాలని గతంలోనే ఆదేశాలు అందాయి. అయితే, గిరిజన సంఘాల నాయకులు అభ్యంతరం చెప్పడంతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పాతపట్నం కేంద్రంగా ఐటీడీఏ రానుందని చెప్పారు. దీంతో ఐటీడీఏ ఇక్కడి నుంచి తరలిపోతుందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏలకు నేటికీ రెగ్యులర్ పీవోలను ప్రభుత్వం నియమించకపోవడంతో ఈ పుకార్లకు బలం చేకూరినట్లు అవుతోంది.

యాప్‌సోపాలు

- అంగన్‌వాడీలపై యాప్‌ల భారం
- లబ్ధిదారుల ముఖ హాజరు నమోదులో ఇబ్బందులు
- సహకరించని ఫోన్లు
- మరోపక్క రికార్డులతో సతమతం

అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో ఆపసోపాలు పడుతున్నారు. నాలుగు యాప్‌లను నిర్వహించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌ల్లో లబ్ధిదారుల ముఖ హాజరు నమోదుకు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాప్‌ల్లో నమోదు చేయడం, రెండుసార్లు ఫేస్ యాప్ గుర్తించేం దుకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సపోర్టు చేయడం లేదు. మరోపక్క 15 రకాల రికార్డుల నిర్వహణతో సతమతమవుతున్నారు. యాప్‌లు, రికార్డుల్లో వారు తలమునకలై ఉంటుండడంతో పూర్వ ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతింటుంది. పని భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొమరాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలపై ఫేస్ యాప్ రూపంలో మరో పని భారం పడింది. ఇప్పటికే బాల సంజీవిని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపు ద్వారా రేషన్ ఇస్తున్నారు. తాజాగా, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ యాప్‌లో కూడా లబ్ధిదారుల ముఖ గుర్తింపు తప్పనిసరి చేశారు. దీంతో రెండు యాప్‌లను



పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారు ఫొటోను తీస్తున్న దృశ్యం

నిర్వహించడం కష్టతరంగా మారిందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. లబ్ధిదారుల నమోదు విషయంలో కనీసం సరైన శిక్షణ లేకపోవడంతో అంతా గందరగోళంగా మారింది.

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 7నెలలు- 3 ఏళ్ల బాలలకు ప్రతీ నెలా పోషకాహారాన్ని వారి ఇంటికే అందిస్తున్నారు. గతంలో కేంద్రం వద్ద వండి ఇచ్చేవారు. అయితే, ఎక్కువమంది నుంచి టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) కావాలంటూ అభ్యర్థనలు రావడంతో పాలు, గుడ్లు, నూనె, పప్పు, బియ్యం వంటివి లబ్ధిదారులకు ప్రతీ నెలా రెండు దఫాలుగా ఇస్తున్నారు.
- టీహెచ్‌ఆర్ పంపిణీలో అవతవకలు జరగకుండా ఇప్పటికే ఎఫ్‌ఆర్‌ఎస్ (ముఖ చిత్ర యాప్)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.



లబ్ధిదారులు వచ్చిన సమయంలో వారి ముఖ చిత్రం ద్వారా గుర్తించి యాప్‌లో నమోదు చేసి టీహెచ్‌ఆర్ అందిస్తున్నారు.

- గర్భిణులు, బాలింతలు, 7నెలలు-3 ఏళ్ల వయసు గల చిన్నారుల పూర్తి వివరాలను మరోసారి పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ యాప్‌లో కూడా లబ్ధిదారుల ముఖ చిత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోంది. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాప్‌ల్లో నమోదు చేయడం, టీహెచ్‌ఆర్ పంపిణీ సమయంలో ఒకే వ్యక్తికి రెండు సార్లు ఫేస్ యాప్ గుర్తించటం అనేది ఇబ్బందికరంగా మారింది. ఇందుకు ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు సపోర్టు చేయడం లేవని తెలుస్తోంది.
- సాధారణంగా టీహెచ్‌ఆర్ కోసం 7నెలలు-3 ఏళ్ల వయసు గల పిల్లలు కేంద్రానికి రారు. వారి తల్లిదండ్రులు గాని, ఇంట్లో పెద్దలు గాని వస్తారు. ప్రస్తుతం పిల్లలకు కూడా రెండుసార్లు ముఖ చిత్రం ద్వారా టీహెచ్‌ఆర్ పంపిణీకి చాలా సమయం పడుతోంది. ఒక్కో కేంద్రం పరిధిలో 20 నుంచి 25 మంది వరకు గర్భిణులు, బాలింతలు ఉంటే, 7-3 ఏళ్లల పిల్లలు 75 నుంచి 150 వరకు ఉంటారు. వీరందరికీ వివరాలను యాప్‌లో నమోదు చేసి ఇవ్వటానికే చాలా సమయం పడుతోంది. అందులోను నెలలో రెండుసార్లు ఈ విధంగా చేయటం అనేది సాధ్యం కాదని, దీనివల్ల పూర్వ ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.
- నిర్ణీత సమయంలో యాప్‌ల్లో వివరాలను నమోదు చేయాలంటూ యంత్రాంగం ఒత్తిడి తీసుకువస్తుంటే పోషణ ట్రాకర్ పూర్తిస్థాయిలో పనిచేయని పరిస్థితి నెలకొంది. కనీసం ఈ విధానంపై సరైన శిక్షణ కూడా ఇవ్వలేదు. ఫేస్ యాప్‌లో నమోదు చేసే సమయంలో లబ్ధిదారుల ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. దీన్ని చెప్పడానికి -మిగతా 8వ పేజీలో..

కాకతీయులు ఏలిన ఊరు

- శైవక్షేత్రంగా పాగిరి...
- చారిత్రక ఆధారాలు లభ్యం
- కాకతీయుల ఇలవేల్పు చాముండి విగ్రహం గుర్తింపు
- అగస్త్యేశ్వర లింగం అప్పటిదే

6లో



గోగుకు దూరం

- సాగుపై ఆసక్తి చూపని రైతులు
- ఏటా తగ్గిపోతున్న విస్తీర్ణం

6లో



కాకతీయులు ఏలిన ఊరు

- శైవక్షేత్రంగా పాగిరి... ● చారిత్రక ఆధారాలు లభ్యం
- కాకతీయుల ఇలవేల్పు చాముండి విగ్రహం గుర్తింపు ● అగస్త్యేశ్వర లింగం అప్పటిదే


నూతనంగా నిర్మించిన ఆలయం

రాజాం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)

పొగిరి.. రాజాం మండలంలోని ఓ గ్రామం. ఈ గ్రామం బౌద్ధంతో ముడిపడినదిగా చరిత్ర చెబుతోంది. ఇక్కడి వెయ్యేళ్ల నాటి కాకతీయుల శిల్ప సంపద నేటికీ వివిధ రూపాలలో సాక్షాత్కరిస్తోంది. నాటి రోజుల్లో ఆ గ్రామం గొప్ప శైవక్షేత్రంగా వెలుగొందినట్లు.. శక్తి స్థలంగా విరాజిల్లినట్లు.. స్థానికంగా ఉన్న పురాతన విగ్రహాలు, శిల్ప సంపద, ఇతర ఆనవాళ్లు స్పష్టం చేస్తున్నాయి. రాతితో చెక్కిన నాగదేవత శిల్పం, వెయ్యేళ్ల నాటి అగస్త్యేశ్వర ఆలయం, కాకతీయులు ప్రతిష్ఠించిన పురాతన రాతి విగ్రహం దీనికి బలం చేకూరుస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఈమని శివ నాగిరెడ్డి, తెలంగాణ చరిత్ర పరిశోధకులు శ్రీరామోజు హరగోపాల్ ధ్రువీకరించారు. మరుగున పడిన శతాబ్దాల ఘన చరితను రాజాం రచయితల వేదిక నిర్వాహకులు, ప్రముఖ రచయిత గార రంగనాథం, సామాజిక కార్యకర్త పారుపల్లి కిరణ్ కుమార్ సహకారంతో పరిశోధించి...కాకతీయుల నాటి ఊరుగా తాజాగా వెలుగులోకి తెచ్చారు.

● ఆధారాలివిగో...

పొగిరిలో మూడు దశాబ్దాల కాలంగా రాజరాజేశ్వరీ దేవిగా పూజలందుకుంటున్నది 11, 12వ శతాబ్దాల నాటి కాకతీయుల ఇలవేల్పు చాముండి రాతి విగ్రహమే. చాముండి మాత కాళ్ల కింద అర్ధనారీశ్వరుడు, అడుగు భాగాన ఎడమ వైపు రాతితో చెక్కిన వరాహం, కుడివైపు ముంగిస ఉంటాయని చరిత్ర చెబుతోంది. ఇవన్నీ ఈ విగ్రహంలో సాక్షాత్కరిస్తున్నాయి. చాముండి మాతకు నాలుగు చేతులు ఉంటాయి. ఒక చేతిలో కత్తి, మరో చేతిలో రక్తపాత్ర, ఇంకో చేతిలో ఢమరుకంపైన పాము, నాలుగో చేతిలో మాలతో కూడిన అభయం ఉంటాయని చరిత్ర చెబుతోంది. ఇవన్నీ ఇక్కడి అమ్మవారి విగ్రహంలో ఉన్నాయి. ఈ ఆధారాలన్నీ ఈ గ్రామం ఓ శైవక్షేత్రంగా విరాజిల్లినట్లు స్పష్టం చేస్తున్నాయి.


శతాబ్దాల నాటి అగస్త్యేశ్వర ఆలయంలోని శివలింగం


11వ శతాబ్దం నాటి చాముండి విగ్రహం

వెయ్యేళ్ల కిందటే...

● కాకతీయుల హయాంలో వెయ్యేళ్ల కిందటే గ్రామంలో అగస్త్యేశ్వరుడి ఆలయ నిర్మాణం జరిగిందని ప్రస్తుతం ఉన్న ఆనవాళ్లను బట్టి చెబుతున్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న శిథిలమైన అగస్త్యేశ్వరుడి ఆలయాన్ని 15 ఏళ్ల క్రితం గ్రామస్తులు పునర్నిర్మించారు. శతాబ్దాలుగా ఉన్న అగస్త్యేశ్వరుడి (శివ) లింగాన్ని అలాగే ఉంచి..అక్కడే కొత్తగా ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నిత్యం వందల మంది స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. పురాతన అగస్త్యేశ్వర ఆలయానికి చెందిన శిలల్ని గ్రామ ప్రారంభంలోని కోనేరు గట్టుపై ఉన్న దశాబ్దాల కాలం నాటి మర్రిచెట్టు వద్ద రచ్చబండ నిర్మాణంలో ఉపయోగించారు. అక్కడే కాకతీయుల కాలం నాటి నందీశ్వరుడి విగ్రహం శిథిలమై పడి ఉంది.

● పురావస్తు శాఖ పరిశీలించినా..

2011లో విశాఖ నుంచి వచ్చిన పురావస్తు శాఖ సిబ్బంది గ్రామంలోని శిల్పకళలు, విగ్రహాలు తదితరాలను పరిశీలించారు. అప్పట్లో గ్రామ పెద్దల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. అవి 11, 12వ శతాబ్దాల నాటి కాకతీయుల నాటి ఆనవాళ్లేనని నిర్ధారించారు. ఆపై వీటి పరిరక్షణకు ఎలాంటి చర్యలూ లేవు.

● అక్కడో గ్రామం ఉండేదట..



ప్రస్తుతం రాజరాజేశ్వరి ఆలయం ఉన్న చోట వందల ఏళ్ల క్రితం ఓ గ్రామం ఉండేదట. అదే ప్రాంతంలో ఓ పెద్ద మట్టిదిబ్బ, ఆ పక్కనే ఓ రాతి విగ్రహం ఉండేదని తాత ముత్తాతల నుంచి కొనసాగుతున్న ప్రచారం. అది కాకతీయుల కాలం నాటిదని దశాబ్దం క్రితమే పురావస్తు శాఖ అధికారులు ధ్రువీకరించారు. విగ్రహం లభ్యమైన చోటనే గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించారు.

-సీఏ నాయుడు, విశ్రాంత డిప్యూటీ డీఈవో, పొగిరి

శివలింగాన్ని తాకకుండానే..



వందల ఏళ్లుగా గ్రామ నడిబొడ్డున అగస్త్యేశ్వర స్వామి వారి శిథిలమైన ఆలయం ఉండేది. కాలక్రమంలో గ్రామం పెరుగుతుండడంతో.. గ్రామస్థులంతా కలసి కొత్తగా నిర్మాణం చేపట్టాం. శతాబ్దాల చరిత ఉన్న ఆలయంలో ఎక్కడ ఉన్న శివలింగాన్ని అక్కడే ఉంచాం. పాత ఆలయానికి చెందిన శిలలను గ్రామ ప్రారంభంలో రచ్చబండ నిర్మాణానికి ఉపయోగించాం.

-వైవీ రమణ, విశ్రాంత డీఈ, మార్కెటింగ్ శాఖ, పొగిరి

● రాజాం చరిత్రను సేకరించే క్రమంలో...



రాజాం చరిత్రకు సంబంధించిన సమాచార సేకరణలో భాగంగా పొగిరిలోని శిల్పాలు, విగ్రహాలను పరిశీలించాను. శివలింగం, నంది శైవానికి సంబంధించినవి. చాముండి, సప్తమాతృకలు శక్తికి సంబంధించినవి. వీటిని హైదరాబాద్, మైసూరు ప్రాంతాలలో ఉన్న పురావస్తు శాఖ అధికారులకు పంపించి సమాచారాన్ని రాబట్టాను. విగ్రహాలు, వాటిపై ఉన్న ఆధారాలను బట్టి పురావస్తు శాఖ అధికారులు కాలాన్ని నిర్ధయించారు. పొగిరిలో నిర్మాణాలు, శిల్పాలు, విగ్రహాలు 11, 12వ శతాబ్దాల నాటివని, కాకతీయుల హయాంలో నిర్మించినవని తేలింది. ఆ ప్రాంతం శైవక్షేత్రంగా వెలుగొందిందని నిర్ధారణ అయ్యింది. ఈ పరిశీలనలో సామాజిక కార్యకర్త పారుపల్లి కిరణ్ చేయూత అందించారు.

-గార రంగనాథం, రచయిత, రాజాం

గోగుకు దూరం

- సాగుపై ఆసక్తి చూపని రైతులు
- ఏటా తగ్గిపోతున్న విస్తీర్ణం

గత ఏడాది జూట్ క్వింటాలు ధర ఇలా...

బాటమ్ రకం	రూ.3,475
బి.బాటమ్	రూ.3,375
ఎక్స్-బాటమ్	రూ.3,275

ఈ ఏడాది ధరలు ఇలా...

బాటమ్ రకం	రూ.3,760
బి.బాటమ్	రూ.3,360
ఎక్స్-బాటమ్	రూ.3,560


బొబ్బిలి మండలం చింతాడలో గోగునారను ఆరబెడుతున్న దృశ్యం



బొబ్బిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాలు గోగుసాగుకు ప్రసిద్ధి చెందినవి. వర్షాధార భూములు ఎక్కువగా ఉండడమే దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం బొబ్బిలి డివిజన్‌లో మాత్రమే గోగు సాగు కనిపిస్తోంది. ఆ విస్తీర్ణం కూడా ఏటా కుదించుకుపోతోంది. ఈ డివిజన్‌లో గోగు సాగు సగటు విస్తీర్ణం 242 హెక్టార్ల నుంచి ఈ ఏడాది 177 హెక్టార్లకు పడిపోయింది. బొబ్బిలి మండలం చింతాడ, రాముడువలస, కలవరాయి, కోమటిపల్లి, ముత్తాయివలస, శివడవలస, దేవుపల్లి గ్రామాలకు మాత్రమే గోగు పరిమితమైంది. ఈ ప్రాంతంలో భూములు మొక్కజొన్న తదితర పంటల సాగుకు అనువుగా లేనందున గత్యంతరం లేక రైతులు గోగు సాగు చేస్తున్నారు. చాలామంది రైతులు నీలగిరి, సరుగుడు, వరి వైపు మళ్లిపోయారు. మిగిలిన గ్రామాలలో రైతులు పెద్ద సంఖ్యలో మొక్కజొన్న సాగు చేసుకుంటున్నారు. చింతాడ గ్రామంలో వంద మంది రైతులు 50 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. కలవరాయిలో కూడా ఇది గణనీయంగా పడిపోయింది.

ఆ సేవలు అంతంతమాత్రమే..

బొబ్బిలి గ్రోత్ సెంటరులో జూట్ టెక్నాలజీ మిషన్‌ను జేసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినప్పటికీ దాని కార్యకలాపాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గోగు ఊరవేతకు నీటి సమస్యను అధిగమించేందుకు రోసా రకం గోగును జేసీఐ ప్రోత్సహిస్తోంది. అయినా రైతులెవరూ ముందుకు రావడం లేదు. బొబ్బిలి జూట్ కొనుగోలు కేంద్రం పరిధిలో 500 ఎకరాల్లో మాత్రమే రోసా జూట్‌ను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది క్వింటాలుకు రూ.285 చొప్పున ధర పెరిగింది. అయినప్పటికీ ఉత్పత్తి లేకపోవడం గమనార్హం. జూట్ పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోవడం... వీటి ఉత్పత్తుల వినియోగంలో ఆశించిన రీతిలో ప్రాచుర్యం లేకపోవడంతో గోగు రైతుల జీవితాల్లో వెలుగులు లేకుండాపోయాయి.

ఐదువేల క్వింటాళ్లకు అవకాశం..

గత ఏడాది 500 క్వింటాళ్ల జూట్‌ను కొనుగోలు చేశాం. ఈ ఏడాది 5 వేల క్వింటాళ్ల కొనుగోలుకు అవకాశం ఉంది. బొబ్బిలి ప్రాంతంలోని కొన్ని గ్రామాలు, మన్యం జిల్లాలోని బలిజిపేట తదితర గ్రామాలలో 480 హెక్టార్లలో మాత్రమే గోగు సాగుచేశారు. రోసా రకం సాగుతో రైతులకు మంచి ప్రయోజనాలు ఉన్నాయి. కానీ ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఈ రకం గోగును వేళ్ల మొదళ్లతో పీకాల్సిన అవసరం లేదు. మొదలు వరకు కర్రలను నరికి తక్కువ నీటిలో శాస్త్రీయ పద్ధతిలో ఊరవేయవచ్చు.

-రాంప్రసాద్, జూట్ కొనుగోలు కేంద్రం, బొబ్బిలి

తగ్గిన విస్తీర్ణం..

గతంలో గోగు పంట సాగుకు చిరునామాగా ఉత్తరాంధ్ర ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఇప్పుడు అందరూ చెరకు, మొక్కజొన్న, లేదా సరుగుడు, నీలగిరి, మామిడి పంటల సాగు వైపు మళ్లుతున్నారు. చింతాడ, రాముడువలస, కలవరాయి, ముత్తాయివలస, శివడవలస, దేవుపల్లి తదితర గ్రామాలలో ఈ ఏడాది గోగు సాగు విస్తీర్ణం సగానికి సగం పడిపోయింది. ప్రత్యామ్నాయం లేని రైతులు మాత్రమే దీనిని సాగు చేస్తుండడం గమనార్హం.

-శ్యామ్‌సుందర్, వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీ

ప్రోత్సాహం కరువు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు గోగు రైతులకు అనుకూలంగా లేవు. జూట్ పరిశ్రమలు మూతపడి పోతున్నాయి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్‌ను అభివృద్ధి చేసే అవకాశాలపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించడం లేదు. రైతుల పక్షాన కాకుండా ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల పట్ల పాలకులకు ప్రేమ ఉండడమే దీనికి కారణం.

-గోపాలం, రైతు సంఘం ప్రతినిధి

తైక్వాండోలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు

● జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

విజయనగరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన అట్టాడ ధనుశ్రీ, అట్టాడ దీక్షశ్రీలు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 4, 5 తేదీల్లో కడప జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో ధనుశ్రీ ప్రతిభ కనబరిచింది. ఆమె డిసెంబరు 18 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమె చెల్లెలు అట్టాడ దీక్షశ్రీ సైతం అక్క బాటలోనే నడుస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తోంది. గత నెల 6, 7 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ పోటీల్లో రాణించడంతో మధ్యప్రదేశ్‌లో ఈ నెల 8 నుంచి 12 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న అక్కాచెల్లెళ్లు ఇద్దరూ పతకాలు సాధించాలని తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. వీరిద్దరినీ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.


అక్కాచెల్లెళ్లు ధనుశ్రీ, దీక్షశ్రీ

నైపుణ్యంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

● ఎస్పీ వకుల్ జిందాల్


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, హాజరైన అధికారులు

విజయనగరం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు అధికారులు మెలకువలు పాటించి, తగిన నైపుణ్యాలు పెంచుకొని.. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వెయ్యాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. గురువారం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో పోలీసు అధికారులకు సైబర్ నేరాల దర్యాప్తునకు సంబంధించిన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాల తీరు మారుతోందని తెలిపారు. ప్రతి నేరమూ సాంకేతికతతో ముడిపడి ఉందన్నారు. ఈ నేరాలను ఛేదించేందుకు దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణ, వృత్తి నైపుణ్యం అవసరమని చెప్పారు. వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటే సైబర్ నేరాల దర్యాప్తు సులభతరం అవుతుందన్నారు. తద్వారా నిందితులను త్వరగా గుర్తించడం... రికవరీలు పెంచడం సాధ్యమవుతుందన్నారు. సైబర్ నిపుణులు రామానుజీ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వేధింపులు, ఆర్థిక మోసాల వంటి నేరాల్లో దర్యాప్తును సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, దిలీప్ కిరణ్, డీఎస్పీలు శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాఘవులు, వీరకుమార్‌లతో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన సి.ఐ.లు, ఎస్.ఐ.లు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

- ఉత్కంఠగా ఆంధ్ర- ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్ ● తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ స్కోర్ 338



విజయనగరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర - ఉత్తరాఖండ్ టీంల మధ్య రంజీమ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 338 పరుగులు సాధించింది. విజయనగరం సమీప చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆతిథ్యంలో ఆంధ్రా- ఉత్తరాఖండ్ జట్ల మధ్య బుధవారం మ్యాచ్ ప్రారంభమైంది. రెండో రోజు గురువారం కూడా పోరు హోరాహోరీగా సాగుతోంది. తొలి రోజు వికెట్ నష్టానికి 232 పరుగులతో ఆట ముగించిన ఉత్తరాఖండ్, రెండో రోజు భారీ స్కోర్ ఖాయమనుకున్న దశలో ఆంధ్రా జట్టు బౌలర్లు అద్భుతంగా రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 135.2 ఓవర్లలో 338 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ సమర్థ్ (59) అర్ధ సెంచరీ సాధించాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు ఎవరూ రాణించకపోవడంతో 338 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్రా బౌలర్లలో లలిత్‌మోహన్ 4 వికెట్లు సాధించగా కేవీ శశికాంత్, సత్యనారాయణరాజు, విజయ్‌లు రెండేసి వికెట్లు సాధించారు.

92 పరుగులకు 4 వికెట్లు..

ఉత్తరాఖండ్ భారీ స్కోర్ చేయకుండా నిలువరించిన ఆంధ్రా జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. గురువారం మధ్యాహ్నం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4 కీలక వికెట్లు నష్టపోయి 92 పరుగులు చేసింది. ఓపెనింగ్ బ్యాటర్లు అభిషేక్‌రెడ్డి (35), హేమంత్ రెడ్డి (18)లు తొలి వికెట్‌కు (54) అర్ధ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించినా 15 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆంధ్రా జట్టు కెప్టెన్ ఎస్‌కె రషీద్ (0) డకౌట్‌తో వెనుతిరగ్గా కరణ్ షిండే 19 పరుగులు చేసి ఆఖరిలో అవుటయ్యాడు. సీనియర్ బ్యాటర్ హనుమ విహారి 15 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మూడో రోజు జట్టు భారమంతా సీనియర్ బ్యాటర్లు హనుమవిహారి, వికెట్ కీపర్ కేఎస్ భరత్‌పైనే ఉంది.

న్యూస్ బాక్స్

ప్రజాస్వామ్యంపై జగన్‌కు నమ్మకం లేదు

● ఎమ్మెల్యే కళావెంకటరావు



మాట్లాడుతున్న కళా వెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మాట్లాడుతున్న నీతి వాక్యాలకు జనం నవ్వుకుంటున్నారని, రాష్ట్రంలో వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసిన ఆయన ఇప్పుడు నీతులు మాట్లాడితే విస్మయం కలుగుతోందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన చీపురుపల్లిలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా, చట్ట బద్ధంగా పని చేస్తున్న పోలీస్ అధికారులని ఆయన భయపెడుతున్నారని, ప్రజాస్వామ్య పాలనపై జగన్‌కి నమ్మకం లేదన్నారు. అనంతరం సభ్యత్వ నమోదుపై నాలుగు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్, కోట్ల మోతీలాల్‌నాయుడు, టి. కిరణ్‌కుమార్, చనమల్లు మహేష్, ఆరతి సాహు, జనసేన నాయకుడు కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కొళాయిల బంద్

బొబ్బిలి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ పరిధిలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనరు లాలం రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అన్నా క్యాంటీన్ సమీపంలో వాటర్ ట్యాంకు దగ్గర, చీపురుపల్లివీధిలో డాక్టర్ రెడ్డి రవికుమార్ ఆసుపత్రి సమీపంలో గల 300 ఎంఎం స్లూయిస్ వాల్వ్‌లను బిగించే పనులు చేపడుతున్నందున తాగునీటిని ఒక రోజు నిలుపుదల చేయాల్సి ఉందని ఆమె తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

వలంటీర్లను కొనసాగిస్తూ ప్రకటన చేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో గ్రామ, వార్డు వలంటీర్లను కొనసాగిస్తూ, ప్రకటన చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. వలంటీర్లను కొనసాగించేలా అసెంబ్లీలో ప్రకటన చేయాలని కోరుతూ గురువారం అంబేడ్కర్ జంక్షన్‌లో మానవహారం చేపట్టి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నినాదాలు చేశారు. రాష్ట్రంలో 2 లక్షల 60 వేల మంది వలంటీర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు తమకు న్యాయం చేస్తారని ఆశించార న్నారు. ఇప్పటికైనా వలంటీర్లకు న్యాయం చే యాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు రంగరాజుతో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సీఐడీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

లక్కవరపుకోట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఐడీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్.కోట మండలంలో గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గల కల్యాణ వేదిక వద్ద షెడ్యూల్డ్ కులాల వారిలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన జరగనున్నట్టు ఎస్ఐ పడాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్ అతిథులుగా హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు.

నేత్ర పరీక్షలు తప్పనిసరి

రాజాం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు పదుల వయసు దాటిన తరువాత ప్రతిఒక్కరూ నేత్రవైద్య పరీక్షలు చేయించుకోవాలని రాజాం పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రాజాం రోటరీ క్లబ్ సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. విజయనగరంకి చెందిన పుష్పగిరి కంటిఆసుపత్రి సిబ్బంది, ఆప్తాలమిక్ అధికారి వసంతరావు తదితరులతో కలిసి ఆయన 72 మందికి నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు.

పరిశుభ్రతతోనే అతిసార నివారణ

బొబ్బిలి రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతను పాటించడం వల్ల అతిసార వ్యాధిని నివారించవచ్చని పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. రఘువంశీ తెలిపారు. మండలంలోని రంగరాయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ రఘువంశీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

వేపాడ నవంబరు7(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వహణలో తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని, అలా కాకుండా ఎవరైనా వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి బాల భాస్కరరావు అన్నారు. మండలంలోని కరకవలస, చామాపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, పరిసరాల పరిశుభ్రతపై పూర్తి స్థాయి పరిశీలన చేపట్టారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

మురుగునీటి శుద్ధి కర్మాగారాలను నిర్మించాలి

▶▶ కలెక్టర్ అంబేడ్కర్



మున్సిపల్ కమిషనర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీల్లో మురుగునీటి శుద్ధి కర్మాగారాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. పట్టణాల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. పురపాలక సంఘాల్లో చెత్త నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లతో తన చాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలో పెద్ద చెరువు వద్ద 5 ఎంఎల్‌డీల సామర్థ్యం గల సుమారు రూ.23 కోట్ల అంచనా వ్యయంతో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన ఎస్‌టీపీ నిర్మాణం నేటికీ పూర్తికాలేదన్నారు. కేవలం 23 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. బొబ్బిలి మునిపాల్టీలో 3 ఎస్‌టీపీలు, 5 ఎస్ఎఫ్‌టీపీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో 4 ఎంఎల్‌డీల సామర్థ్యంతో 1.6 విస్తీర్ణంలో ప్రతిపాదిత ఎస్‌టీపీ రాజాం మున్సిపాల్టీలో 3 ఎస్‌టీపీలు, 7 ఎస్ఎస్‌టీపీల నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

● జిల్లాలోని బడిబయట ఉన్న పిల్లలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో? వారు ఏమి చేస్తున్నారో? విద్యార్థుల వారీగా నివేదిక ఇవ్వాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్య దృష్ట్యా సుమారు పది వేలు మంది పిల్లలు బడి బయట వుండవచ్చని డీఈవో తెలిపగా వారిపై అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అపార్ ప్రక్రియను వేగవంతం చేయండి

జిల్లాలోని అపార్ జారీపై కలెక్టర్ అంబేడ్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అపార్ (ఆటోమేటిడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలలో బర్త్ సర్టిఫికేట్లు లేని విద్యార్థుల చేత దరఖాస్తు చేయించి, బర్త్ సర్టిఫికెట్లను మంజూరు చేయించాలన్నారు.

తవ్వకాలు చేస్తే వాహనాలు సీజ్ చేస్తాం



వంతెనకు ఐదువందల మీటర్ల దూరంలో ట్రెంచ్‌లు తీయిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోస్తనీతీరంలో పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, వేములాపల్లి వంతెన కింద తవ్వకాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంపై ఆంధ్రజ్యోతిలో 'గోస్తనీతీరం తవ్వేస్తున్నారు' అని కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ అరుణకుమారి గురువారం స్పందించారు. వెంటనే ఆర్ఐ మనోజ్‌కుమార్, గోస్తనీ పరివాహక ప్రాంత వీఆర్‌వోలను అక్కడకు పంపించారు. అక్కడకు చేరుకున్న ఆర్ఐ మనోజ్‌కుమార్ వంతెన సమీ పంలో తవ్వకాలు చేస్తున్న వాహనాల వద్దకు వెళ్లి అడ్డగించారు. మరోసారి ఇక్కడ తవ్వకాలు చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం వంతెన నుంచి ఐదువందల మీటర్ల దూరం గుర్తించి వంతెన వద్దకు ఏ వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్‌లు తవ్వించారు. రెండురోజుల్లో ఊట బావులకు, వంతెన వద్దకు వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడ తామని పేర్కొన్నారు.

ఇసుక తవ్వకాలకు చెక్

రేగిడి, నవంబరు 7(ఆంధజ్యోతి): రక్షితబావుల దరిలో ఇసుకదోపిడిపై ఈనెల 7న ఆంధ్రజ్యోతిలో ప్రధానశీర్షికన వార్త ప్రచురణ అయింది. దీనిపై జాయింట్ కలెక్టర్, ఆర్‌డీవో తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. దీనిపై క్షేత్ర స్థాయి నివేదిక కోరటంతో తహసీల్దార్ చిన్నారావు, ఆర్ఐ రేవతి ఇతర రెవెన్యూ బృందం బొడ్డవలస నదీతీరాన్ని గురువారం సందర్శించారు. తనిఖీ సమయంలో బొడ్డవలస ఈవలి ఒడ్డులో తవ్వకాలు లేకపోగా, ఒకటిరెండుచోట్ల ఇసుక కుప్పలు నిల్వలను రెవెన్యూబృందం గుర్తించారు. వంతెన, రక్షితసోర్స్‌లకు దరిలో జెసిబితో త్వవ్వకాలు జరుగుతున్నట్లు తహశీల్దార్ ధ్రువీకరించారు. అంతకముందు బొడ్డవలసలో గ్రామస్తులతో తహశీల్దార్ సమావేశమై రక్షితబావుల చెంతనే ఇసుక త్రవ్వకాలు, నిల్వాలు మంచిదికాదని, వీటి అనర్థాలు, ఇంకా చట్టపరమైన చర్యలపై వారికి చైతన్యం కల్గించారు. ఆయన వెంట సర్వేర్‌తో పాటు వీఆర్వో దుర్గారావు తదితర్లు ఉన్నారు.

విద్యార్థులంతా అపార్‌లో నిక్షిప్తమవ్వాలి

లక్కవరపుకోట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులంతా అపార్‌లో పేరును నిక్షిప్తం చేసుకోవాలని ఎంఈవో సీహెచ్.కూర్మారావు గురువారం ఒక పత్రటనలో తెలిపారు. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకొని తమ విద్యాప్రగతిని డిజిటల్ లాక్‌లో పొందుపరచుకోవాలన్నారు. ఇందుకోసం విద్యార్థి పాఠశాల రికార్డు షీటు ఆధార్‌తో మ్యాచ్ కావ్వాలన్నారు. మండలంలో 59 పాఠశాలల్లో 3754 మంది విద్యార్థులు ఉండగా అందులో 2888 మంది అపార్‌లోకి వచ్చారన్నారు. ఇంకా మిగిలిన వారు ఈ నెల 18లోగా నమోదు చేసుకోవాలన్నారు. వీటి నమోదు కోసం హైస్కూల్‌లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల ముందు చేసిన పనులకు బిల్లుల్లేవు

బొబ్బిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల ముందు చేపట్టిన పలు పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మున్సిపల్ సివిల్ సీనియర్ కాంట్రాక్టర్ చప్ప చంద్రశేఖర్ వాపోయారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల ముందు తన గోడు వినిపించారు. గతంలో ఏఈగా పనిచేసిన సురేష్‌కుమార్ ఇక్కడి ఇంజినీరింగ్ వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని ఆరోపించారు. స్వామివారి వీధిలో రూ. 14 లక్షలతో మూడు పనులు, పోస్టాఫీసు సందులో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు, కోరాడవీధి స్మశాన వాటికలో రూ. 5 లక్షలు, ఓంకార్ థియేటర్ వెనుక రూ. 5 లక్షలు, మల్లమ్మపేటలో రూ.1.45 లక్షలతో సీసీ రోడ్డు పనులను పూర్తి చేశామని, కానీ లక్షలాది రూపాయల బిల్లులను సకాలంలో చెల్లించలేదన్నారు. ఆయన ఉద్దేశపూర్వకంగా ఇదంతా చేశాడని దుయ్యబట్టారు. మున్సిపాలిటీకి కొత్తగా వచ్చిన డీఈఈతో పాటు ముగ్గురు ఇంజనీర్లు ఉన్నారని, గాడి తప్పిన ఇంజనీరింగ్ వ్యవస్థనంతటినీ మున్సిపల్ కమిషనర్ గాడిలో పెట్టాలని ఆయన కోరారు.

రైల్వే పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వేలో రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఖాళీగా ఉన్న 2 లక్షల 98 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ డిమాండ్ చేశారు. గురువారం రైల్వే స్టేషన్‌లోని స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ, కాంట్రాక్టు ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు పదవీ విరమణ చేసిన సిబ్బందిని రీ ఎంగేజ్‌మెంట్‌ను అమలు చేయాలని రైల్వేశాఖ ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైల్వేశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ప్రతినిధులు కిరణ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

లక్కవరపుకోట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎల్.కోటలో గల విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు ప్రకటనలో తెలిపారు.

రోడ్డుపై ఇంజనీరింగ్ లోపాలు సవరించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్



రహదారిపై ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బొండపల్లి, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 26పై అంబటివలస తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతంలో జాతీయ రహదారి అధికారులు ఇంజనీరింగ్ లోపాలు సవరించాలని, అందుకు సమగ్ర నివేదిక తయారు చేసి ఇవ్వాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావుకు సూచించారు. అంబటివలస గ్రామం వద్ద జాతీయ రహదారిని ఆయన సర్కిల్ పరిధిలోని పోలీసులతో కలిసి పరిశీలించారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు గ్రామ సమీపంలోని వందమీటర్ల పరిధిలో జరుగుతున్నట్టుగా గుర్తించామని, దీనికి సంబంధించి సమగ్ర నివేదికను తయారుచేసి అందజేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ జీఏపీ రమణ, ఏఎస్ఐ యు.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో విజయం సాధిస్తాం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

● విజయనగరం స్థానిక సంస్థల ఎన్నికలకు శంబంగి నామినేషన్



నామినేషన్ అందజేస్తున్న శంబంగి తదితరులు

విజయనగరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన నామినేషన్ పత్రాలను జేసీ సేతుమాదవన్‌కు అందచేశారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై ఎన్నికల ముందు జగన్‌రెడ్డి అనర్హత వేటు వేయించిన సంగతి విదితమే. దీంతో ఖాళీగా ఉన్న విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల సంఘం ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేయడంతో వైసీపీ అధిష్ఠానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంబంగి పేరును బుధవారం ఖరారు చేసింది. ఈ మేరకు శంబంగి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సేతుమాధవన్‌కు అందజేశారు. శంబంగి నామినేషన్ కార్యక్రమానికి ఆయన వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఆపార్టీ నాయకులు తదితరులు వెంట వచ్చారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి శంబంగి మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చారన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్ సీపీకి స్థానిక సంస్థల్లో 80 శాతం వరకు మెజార్టీ బలం ఉందన్నారు. అయితే ఇందుకూరి రఘురాజుకు అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువరించడంపై మీడియా ప్రశ్నించగా, ఎన్నికలను రద్దు చేస్తూ ఎన్నికల సంఘం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, అధిష్ఠానం సూచన మేరకు నామినేషన్లు దాఖలు చేశామన్నారు.

గిరిజన విద్యార్థి మృతిపై విచారణ

జియ్యమ్మవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్‌కుమార్(12) మృతిపై డీఈవో నల్లా తిరుపతినాయుడు ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం విచారణ చేపట్టింది. బుధవారం జీవన్‌కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబుతో కలిసి విచారణ ప్రారంభించారు. ముందుగా సహ విద్యార్థులతో మాట్లాడి ఏమి జరిగిందని అడిగి తెలుసుకున్నారు. తర్వాత హెచ్ఎం ఎస్.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్.గణపతిరావు, ఆఫీసు సబార్డినేట్ వెంకటేష్, కుక్ రాజేష్ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. అలాగే డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతితో మాట్లాడిన డీఈవో.. ఆసుపత్రి వైద్యాధికారి, ఆ సమయంలో ఉన్న ఏఎన్ఎం వాంగ్మూలంను తీసుకున్నారు. ఇదిలా ఉండగా తన కుమారుడు జీవన్‌కుమార్ ఆకస్మిక మరణానికి ఎవరూ కారకులు కాదు అని మృతుని తల్లిదండ్రులు చెప్పడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంఈవో -1 డి.గౌరునాయుడు, తహసీల్దార్ డి.పకీరు, ఎంపీపీ బొంగు సురేష్, అలమండ సర్పంచ్ చంటి, వైస్ ఎంపీపీ నరేష్, ఆర్‌ఆర్‌బీ పురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.శృతి తదితరులు పాల్గొన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని డీఈవో చెప్పారు. కాగా మృతిచెందిన విద్యార్థి జీవన్‌కుమార్ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం, వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం నాయకులు కె.గంగునాయుడు, కె.సీతారాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

కొత్తవలస, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల రైతు సంఘం నాయకులతో కలసి కొత్తవలస సచివాలయంలో వినతిపత్రం అంద చేశారు.

టూరిజం హోటల్స్ ఏర్పాటుకు పరిశీలన



తాటిపూడి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

విజయనగరం కలెక్టరేట్ /భోగాపురం; నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆతిధ్య రంగంలో అ డుగు పెట్టేందుకు టాటా సంస్థకు చెందిన ఐహెచ్‌సీఎల్ ఆసక్తి కనబరుస్తోంది. అందు లో భాగంగా ప్రతినిధులు బృందం గురువారం జిల్లాలో పర్యటించి పలు ప్రాంతాల్లో పర్యాటక హోటల్స్ ఏర్పాటు కోసం స్థలం పరిశీలన చేసింది. ఐహెచ్‌సీఎల్ గ్రూపు ఆసో సియేట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ నానడే నేతృత్వంలోని నలుగురు సభ్యులు బృందం జిల్లా పర్యటించి, పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించింది. జేసీ సేతు మాధవన్‌తో కలిసి ఈ బృందం సభ్యులు ముందుగా భోగాపురం ఎయిర్ పోర్టులో భాగంగా ఏర్పాటు చేయనున్న ఏరోసిటీని సందర్శించింది. అనంతరం జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌ను కలెక్టరు కార్యాలయంలో కలిసి జిల్లాలో పర్యాటక రంగంలో పెట్టు బడులకు గల అవకాశాలపై చర్చించారు, భోగాపురం నుంచి మధురవాడ వరకూ ఐటి హబ్‌గా అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ,అందువల్ల ఈ ప్రాంతం హోట ల్స్, రిసార్టులు ఏర్పాటుకు అనువైన ప్రదేశమని ప్రతినిధి బృందానికి కలెక్టరు వివరించారు.

గంట్యాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తాటిపూడి పర్యాటక ప్రాంతాన్ని ఐహెచ్‌సిఎల్ గ్రూపు ఆసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ నానడే నేతృత్వంలోని నలుగురు సభ్యులు బృందం జిల్లా పర్యటింది. హోటల్ ఏర్పాటుకు చేసేందుకు స్థలం పరిశీలించారు. ఎక్కడ హోటల్ ఏర్పాటు చేస్తే బాగుటుందని అనేదానిపై పరిశీలించి తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టరు సుధారాణి, ఏపిఈడిబి ప్రతినిధి రామేశ్వర్, ఏపిటిపి ప్రతినిధి రాం ప్రసాద్ , ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాంతాయ డైరక్టరు రమణ, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు

చీటీల కేసులో నలుగురి అరెస్టు

భోగాపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కొత్త చెరుకుపల్లి గ్రామంలో చీటీల కేసుకు సంబంధించి గురువారం నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. ఆమె గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త చెరుకుపల్లి గ్రామానికి చెందిన రిక్కా నరశింగరావు చీటీలు నిర్వహించి మోసం చేశారంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే భీమిలి పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన భీమిలి పోలీసులు చెరుకుపల్లిలో చీటీలు నిర్వహించిన భీమిలి మండలం రావుపాలెంకు చెందిన భార్యా భర్తలయిన వంగపడు రోజా, వంగపండు శ్రీనివాస్‌ను ఇదివరకే అరెస్టు చేశారు. చీటీలు నిర్వహించి మోసగించి గాజువాకలో ఉంటున్న భీమిలి, తగరపువలస గ్రామాలకు చెందిన అలిపల్లి వెంకటేష్, చోడిపల్లి సంధ్యారాణి, చోడిపల్లి ప్రభు, కొమర కనకమహాలక్ష్మిలను స్థానిక సీఐ ఎస్వీ ప్రభాకర్ సూచనల మేరకు అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

నాలుగున్నర తులాల బంగారం చోరీ

గరుగుబిల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దళాయివలస గ్రామానికి చెందిన గంట గంగమ్మ మెడలోని నాలుగున్నర తులాల బంగారాన్ని చోరీ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. దళాయివలస గ్రామం నుంచి పార్వతీపురంలోని గ్యాస్ కార్యాలయానికి బయలుదేరిన సమయంలో బైక్‌పై ఓ వ్యక్తి వచ్చి, ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి వరకు దిగబెడతానని గంగమ్మను తీసుకువెళ్లాడు. అయితే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తోట వైపు వాహనం తిప్పడంతో ఎందుకు ఈ వైపు తీసుకువెళ్తున్నారని ప్రశ్నించింది. ఆపకపోవడంతో బైక్‌పై నుంచి దిగేందుకు ప్రయత్నించి రహదారిపై పడిపోయింది. దీంతో తలకు గాయం తగిలి స్పృహ తప్పిపోయింది. దీంతో ఆ అపరిచిత వ్యక్తి గంగమ్మ మెడలోని రెండు తులాల గొలుసు, రెండున్నర తులాల పుస్తెల తాడు తీసుకుని పరారయ్యాడు. స్పృహ వచ్చిన తర్వాత గ్రామస్థులు ఆమెను పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గరుగుబిల్లి ఎస్ఐ పి.రమేష్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తిపై గాలింపు చర్యలు చేపడుతున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమలి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న బెల్టు షాపు నిర్వాహకుడి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కొప్పల రాము మద్యం అమ్మకాలు చేపడుతున్న అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడి చేయగా 20 మద్యం సీసాలు పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

బాలిక అదృశ్యం

లక్కవరపుకోట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదైనట్టు ఎస్.పడాల్ గురువారం తెలిపారు. మండలంలోని రేగ గ్రామానికి చెందిన రావాడ తులసి ఈ నెల 4 నుంచి కనిపించడం లేదని తండ్రి పైడునాయుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధర్మవరంలో డెంగ్యూ కేసు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 7: మండలంలోని ధర్మవరం గ్రామంలో డెంగ్యూ కలకలం రేగింది. గ్రామానికి చెందిన కక్కల ఎర్నమ్మ అనే బాలింతకు డెంగ్యూ వచ్చినట్లు విజయనగరం ఘోషా ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఈ విషయంపై కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక మాట్లాడుతూ గ్రామానికి చెందిన కక్కల ఎర్నమ్మ ప్రసవం కొసం ఘోసాసుపత్రిలో చేరిందని, శిశువును ప్రసవించాక ఈమెకు జ్వరం రావడంతో సదరు ఆసుపత్రిలో పరీక్షలు చేయగా డెంగ్యూగా నిర్ధారణయ్యిందని తెలిపారు. వెంటనే తమ సిబ్బంది గ్రామానికి చేరుకుని చుట్టుపక్కల 50 ఇళ్లల్లో వైద్యపరీక్షలు చేశారన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

రాజాం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రాజాం సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత వారం రోజులుగా జరిపిన వేర్వేరు దాడుల్లో 81 మద్యం సీసాలను స్వాదీనం చేసుకొని ఆరుగురుపై కేసులు నమోదు చేశామన్నారు.

జీసీసీ గోదాంలో అగ్నిప్రమాదం

● రూ.15 లక్షల ఆస్తి నష్టం

కురుపాం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మొండెంఖల్‌లోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గోదాంలో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 500 క్వింటాళ్ల నరమామిడి చెక్క దగ్ధం అయ్యింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. సాలూరుకు చెందిన బలరాం రాజు అనే వర్తకుడు జీసీసీ వద్ద నుంచి కిలో 22 రూపాయలు చొప్పున నరమామిడి చెక్కను కొనుగోలు చేశారు. బలరాం రాజు ఇంకా సరుకును తరలించక ముందే అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనా స్థలాన్ని జీసీసీ డివిజినల్ మేనేజర్ మహేంద్ర కుమార్ పరిశీలించారు. ప్రమాద కారణాలు, నష్టం వివరాలు పూర్తి స్థాయిలో తెలియాల్సి ఉంది.

వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన

రాజాం: స్వచ్ఛ రాజాం లక్ష్యంలో భాగంగా రాజాం పురపాలక సంఘం కమీషనర్ జె రామప్పలనాయుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యర్థాల ప్రజలే వేరు చేయడంపై అవగాహన కల్పించాలని ఆలోచన చేసి తడి చెత్త .పొడి చెత్త వేరు చేయడంపై పోస్టర్ ముద్రించి గురువారం కార్యాలయంలో ప్రారంభించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధి. స్కూల్. కాలేజీలు. సచివాలయాలు .ప్రభుత్వ కార్యాలయాలు వద్ద పోస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. ఇళ్ల వద్ద వ్యర్థాలు వేరు జరిగితే చాలా మంచి ఫలితాలు వస్తాయన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేయడం చాలా సులభం అవుతుందన్నారు. ఇప్పటికే అపార్ట్‌మెంట్‌లు వద్ద చెత్తను వేరు చేయడం ఎరువు తయారీ జరుగుతోందని ప్రజల్లో అవగాహన తీసుకురావడవలన మరింత ఫలితాలు తీసుకువస్తామన్నారు. పోస్టర్‌లు విడుదల సందర్భంలో మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెనటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్. ఏఈ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన



శృంగవరపుకోట రూరల్: మండలంలోని సంతగైరమ్మపేట గ్రామంలో ధాన్యం సేకరణ, జీడి మామిడి ఇన్సూరెన్స్ అంశాలపై మండల వ్యవసాయాధికారి రవీంద్ర గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధాన్యంలో తేమశాతం, మద్దతుధర, నాణ్యత ప్రమాణాలు, వ్యర్థ పదార్థాలు, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం, ముడుచుకుపోయిన ధాన్యం, గోనె సంచులు, రవాణచార్జీలు వంటి విషయాలను వివరించారు.

సీతంపేట ఐటీడీఏపై నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

పీవో ఉంటే తమకు ఈ పరిస్థితి ఉండేది కాదని వారు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ పీవోను నియమించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఏదీ నాటి సహకారం?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఐటీడీఏ ద్వారా గిరిజనులకు వివిధ సంక్షేమ పథకాలు అందాయి. 2014-2019 మధ్య పీవీటీజీలకు సీసీడీపీ (కన్జర్వేటివ్ కాంప్రహెన్సివ్ డెవలప్‌మెంట్ ప్లాన్) నిధులు రూ.12కోట్లను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో 19 మండలాల్లోని సవర, గదబ కులాలకు చెందిన 1.6లక్షల మంది ఆదివాసీలు వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందారు. అలాగే ట్రైకార్ పథకం కింద ఆ ఐదేళ్లలో రూ.24కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా 2,400 మంది గిరిజనులు రుణ సహాయం పొందారు. ఇక ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ పథకానికి సంబంధించి రూ.5కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో గిరిజన యువతకు ఇన్నోవా, బొలేరో వంటి పాసింజర్ వాహనాలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలు, సప్లయర్స్, డైరీ ఫాం, ఇటుకల తయారీ వంటి యూనిట్లను కేటాయించారు. అదే విధంగా ఎస్‌సీఏ-టీఎస్‌పీ కింద రూ.7కోట్లు కేటాయించి గిరిజనులకు యూనిట్లను మంజూరు చేశారు. మొత్తంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీలు రూ.53కోట్ల లబ్ధిపొందారు. కానీ, వైసీపీ ప్రభుత్వం గిరిజనుల కోసం ఒక్క పథకం కూడా అమలు చేయలేదు సరికదా, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సైతం పక్కదారి పట్టించిందనే విమర్శలు ఉన్నాయి.

ఎటువంటి సమాచారం లేదు

సీతంపేట ఐటీడీఏను ఇక్కడి నుంచి తరలిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి మాకు ఎటువంటి సమాచారం లేదు. నిధుల లేమికి సంబంధించి ఇంకా ఓటు ఆన్ బడ్జెట్ పెట్టలేదు. బడ్జెట్ ఆధారంగా ఐటీడీఏకు నిధులు ఏ మేరకు కేటాయిస్తారనే దానిపై స్పష్టత వస్తుంది.

- జి.చిన్నబాబు, ఐటీడీఏ ఏపీవో

యాప్‌సోపాలు

(5వ పేజీ తరువాయి)

చాలామంది సందేహిస్తున్నారు. దీంతో నమోదు మరింత ఆలస్యమవుతోంది.

● అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు యాప్‌లు నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్‌లో ప్రతి రోజు చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నోట్ చేయాలి. వీటితో పాటు రెండు యాప్‌ల్లో నిత్యం మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ప్రీ స్కూల్ నిర్వహించి ఆ ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నేషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒకసారి మిల్కీ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి.

రికార్డుల భారం

అంగన్‌వాడీ ఉద్యోగి 15 రికార్డులను నమోదు చేయాలి. ఆహారం వినియోగం రికార్డు (ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ రికార్డులు (ఎస్ఎన్‌టీ), ప్రీ స్కూల్ అడ్మిన్ రికార్డులను నిత్యం నమోదు చేయాలి. వీటితో పాటు టీకా రిజిస్టర్, విటమిన్-ఏ రికార్డు, రిఫరల్ సర్వీసెస్‌గృహ సందర్శకుల రికార్డులు చేయాలి. నెలవారి ప్రాజెక్టు (ఎంటీఆర్) అంగన్‌వాడీ పరిధిలోని హౌస్ హోల్డ్ సర్వే గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్ట్‌తో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అడ్మిన్ రిజిస్టర్‌తో సహా 15 రికార్డులు మోయవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో తమపై ఈ భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి

గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో అంగన్‌వాడీలను భాగస్వామ్యం చేస్తున్నారు. తల్లి గర్భంలో బిడ్డ పడిన నుంచి ఆ చిన్నారి ఆరేళ్ల వయసు వచ్చే వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. తల్లికి, బిడ్డకు పోషణ, టీకాలు, వారి ఆరోగ్య కార్డులు వంటి వివరాలను నిత్యం యాప్‌ల ద్వారా నమోదు చేయడం ఎంతో భారంగా మారుతుంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కొంత తగ్గించాలి.

- బి.అలివేలు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నాయకురాలు, కొమరాడ

సమగ్ర నివేదిక ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థితో పాటు కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి అనారోగ్యంతో మృతిచెందిన సమాచారం తెలుసుకున్న ఆయన ఆశ్రమ పాఠశాల నిర్వహణ, నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

డీఈవో సందర్శన

కురుపాం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో తిరుపతినాయుడు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సిలబస్, విద్యా ప్రమాణాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలు, టీచింగ్ నోట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎన్.సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి, గుమ్మలక్ష్మీపురం ఎంఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

పార్వతీపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలంలో ఆర్ఆర్‌బీపురం ఆశ్రమ పాఠశాలలో చదువుతూ బుధవారం అకస్మాత్తుగా మృతిచెందిన ఏడో తరగతి విద్యార్థి జీవన్ తండ్రికి పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ గురువారం లక్ష రూపాయల సాయం అందించారు. మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యాం ప్రసాద్, పీవో అశుతోష్ శ్రీవాస్తవ చొరవతో విద్యార్థి కుటుంబానికి ఈ సాయం అందజేశారు. ఏపీవో మురళీధర్, గిరిజన సంఘాల నాయకులు రంజిత్‌కుమార్, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడాలి

సాలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యాన్ని వీడి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఎన్‌వై.నాయుడు డిమాండ్ చేశారు. ఆ కమిటీ సభ్యులు గురువారం సాలూరులో వివిధ విద్యా సంస్థలను, బాలికల, బాలుర వసతి గృహాలను సందర్శించారు. ఇటీవల విద్యార్థులు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని వాటికి సంబంధించి ఓ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలను నియమించాలన్నారు.

15న 'జన్మన్ యోజన' మెగా ఈవెంట్

రాయగడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న ప్రధాన మంత్రి జన్మన్ యోజన గ్రామీణ ఉన్నతి పథకం మెగా ఈవెంట్ నిర్వహించేందుకు కలెక్టర్ పారుల్‌పట్వారి అధ్యక్షతన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్పీ సమావేశ హాలులో జరిగిన కార్యక్రమంలో జడ్పీ కార్యనిర్వాహణాధికారి నిహర్‌రంజన్ కహర్, సబ్ కలెక్టర్, గిరిజన సంస్థ అధికారి కళ్యాణి సంఘమిత్ర దేవి, గుణుపూర్ సబ్ కలెక్టర్, జిల్లా ముఖ్యవైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్ తదితరులు పాల్గొన్నారు. బిర్సాముండా జయంతి వేడుకలు ఈనెల 15 నుంచి 26 వరకు జరిపేందుకు నిర్ణయించారు. ఈసందర్భంగా గ్రామస్థుల ఆర్థిక పురోగతికి దర్తీ అబా జనజాతి ఎక్సలెన్సీ పథకం అమలుకు 11 సమితుల బీడీవోలు, అధికారులు, అన్ని విభాగాల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన ఓ కమిటీని నియమించారు.

ఇదేనా చె(చి)త్త శుద్ధి?

● పిల్లర్లకే పరిమితమైన ఎస్‌డబ్ల్యూపీసీ
● నిర్మాణం వద్దే చెత్త డంపింగ్
● దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది



అర్ధాంతరంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద పేరుకుపోయిన చెత్త

మక్కువ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై అధికారులకు ఎంత చిత్త శుద్ధి ఉందో ఈ చిత్రం చూస్తేనే అర్థమవుతుంది. మక్కువ మండలంలోని శంబర గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ) పిల్లర్లకే పరిమితమయ్యింది. అతి పెద్ద మేజర్ పంచాయతీ అయిన ఆ గ్రామంలో సేకరించిన చెత్తను అర్ధాంతరంగా నిలిచిన ఈ ఎస్‌డబ్ల్యూపీసీ బయటే పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అధ్వానంగా దర్శనమిస్తోంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఏటా శంబర జాతర సమయంలో గ్రామంలో అధిక సంఖ్యలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ట్రాక్టర్లతో చెత్తను తీసుకెళ్లి రహదారి పక్కనే డంపింగ్ చేస్తుంటారు. ఎస్.పెద్దవలస రహదారికి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. ఇప్పటికైనా ఎస్‌డబ్ల్యూపీసీని పూర్తిచేసి, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూపడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

45 రోజుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

సాలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాలూరులోనే ఇళ్ల నిర్మాణం ప్రగతి చాలా తక్కువగా ఉందని, మరో 45 రోజుల్లోనే 360 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అధికారులకు ఆదేశించారు. పట్టణానికి సమీపంలో ఉన్న గుమడాం లేఅవుట్ 4, 5లను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్, సచివాలయ, ఇంజనీరింగ్, హౌసింగ్‌శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. 1342 ఇళ్లు గుమడాం 4, 5 లే అవుట్‌లలో మంజూరు చేస్తే కేవలం 28 మాత్రమే పూర్తి కావటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 750 ఇళ్ల నిర్మాణం అస్సలు మొదలు కాలేదని, మరికొన్ని ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 360 ఇళ్ల నిర్మాణాలు మరో 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చిన నిర్మాణదారులకు కావాల్సిన సామగ్రిని అధికారులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి అవసరమైతే లోన్ సదుపాయం కూడా కల్పించాలన్నారు. గుమడాం లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు పురోగతికి సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. గుమడాం లేఅవుట్‌లో ఇళ్లు మంజురు జరిగిన వారికి మళ్లీ కొత్త పథకంలో ఇళ్లు మంజూరు కావని తెలిపా రు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, మున్సిపల్ డీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సాలూరు సమీపంలో గుమడాం లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అవగాహనతో క్యాన్సర్‌కు దూరం

● డీఎంహెచ్‌వో విజయపార్వతి



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పార్వతీపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): అవగాహన, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ ప్రబలకుండా జాగ్రత్తపడవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.విజయపార్వతి తెలిపారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. విజయపార్వతి మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడానికి ప్రాథమిక, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం ఆశా, నోడల్ అధికారుల సమావేశం నిర్వహించి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, రఘుకుమార్, వినోద్‌కుమార్, డెమో యోగీశ్వరరెడ్డి, డీపీహెచ్ఎన్ ఉషారాణి, డీపీవో లీలారాణి, ఎస్‌వో శంకర్, డీసీఎం విజయలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోండి

వీరఘట్టం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంతనర్సిపురంలో వ్యవసాయశాఖ జేడీ రాబర్ట్‌పాల్ గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎంటీయూ 1318 వరి రకానికి నల్లకుంకి తెగులు అధికంగా ఆశించి పంట నష్టం వాటిల్లిందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ వరకు ఈ పంట నమోదైన రైతులకు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రబీ సీజన్ నుంచి మాత్రం రైతులు ప్రీమియం చెల్లించాలని చెప్పారు. జిల్లాలో వరి పంట ఎకరానికి రూ.84, మొక్కజొన్న ఎకరానికి రూ.72, పెసర పంట రూ.40, జీడి మామాడి తోటలు ఎకరానికి రూ.1600 చొప్పున కట్టి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఏడీఏ రత్నకుమారి, ఏవో సౌజన్య పాల్గొన్నారు.

దిగుబడులు నిర్ధారించేందుకు పంట కోత ప్రయోగాలు

గరుగుబిల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంట దిగుబడులు నిర్ధారించేందుకు పంట కోత ప్రయోగాలు చేపడుతున్నామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో) పి.వీర్రాజు తెలిపారు. మండలంలోని గొట్టివలస, పెద్దూరు గ్రామాల్లో చేపట్టిన వరి పంట కోత ప్రయోగాలను మండల ఉప గణాంకాధికారి కోటిపల్లి విజయరావుతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం కింద పంట కోత ప్రయోగాలను చేపడుతున్నట్టు చెప్పారు. మండలంలో 96 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నామన్నారు. మండల ఉప గణాంకాధికారి విజయరావు మాట్లాడుతూ గొట్టివలస గ్రామంలో ఐదు ఇంటూ ఐదు సైజులో వరి పంట కోత ప్రయోగం చేపట్టగా 14.767 కిలోల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. పెద్దూరులో చేపట్టిన పంట కోత ప్రయోగంలో 11.200 కిలోల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన వరి పంట కోత ప్రయోగాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఏఎస్‌వో విజయరావు తెలిపారు.

వసతిగృహాల్లో మరమ్మతులకు అంచనాలు

● జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి కృష్ణ

పార్వతీపురం, నవంబరు (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాల మరమ్మతుల కోసం అంచనాలను రూపొందించాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజనీర్‌ను కోరినట్టు జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఎస్.కృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకుల సూచనలు అనుసరించి కలెక్టర్ ఆదేశాలతో ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్‌తో బీసీ వసతిగృహాల మరమ్మతులు చేయడానికి అంచనాలు కోరామన్నారు. అవి అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టిడ్కో ఛైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

సీతానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల సమస్యలను పార్వతీపురం నియోజకవర్గ పీవోసీ ఆడాడ మోహనరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన నాయకులు రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ దృష్టికి గురువారం తీసుకుని వెళ్లారు. ఈసందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల పంపిణీలో జరిగిన జాప్యాన్ని టిడ్కో ఛైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. టిడ్కో ఇళ్లపై సమగ్ర సమీక్ష చేపడుతున్నామని, గతంలో అర్హత ఉండి జాప్యానికి వారికి పంపిణీ చేయాలని యోచిస్తున్నామని, పార్వతీపురం నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ల సందర్శన కూడా చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లు రమేష్, పి.శ్రీను, రెడ్డి కరుణ, కె.సత్యనారాయణ, కె.మురళీ, మాజీ ఎంపీపీ పి.తిరుపతిరావు, పి.జయకృష్ణ, సారిక శేఖర్, బి.సురేష్, శ్రీను, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చిందులు

● ధాన్యం కొనుగోలు అవగాహన సదస్సులో ఎంపీపీ, వైస్ ఎంపీపీ వీరంగం

మెంటాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అలజడి రేగింది. అధికారులపై ఎంపీపీ, వైస్ ఎంపీపీ చిందులు తొక్కడం చూసిన వివిధ శాఖల సిబ్బంది ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన మార్గదర్శకాలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పౌరసరఫరాల అధికారులు, వ్యవసాయాధికారి, టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సివిల్ సప్లయిస్ డీటీ మాట్లాడుతుండగా ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు అక్కడికి వచ్చి...'సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసే అధికారం ఎవరిచ్చారు.. నా అనుమతి తీసుకోవాలని తెలీదా... అంతా మీ ఇష్టమేనా... అసలు మా గురించి ఏమనుకుంటున్నారు... మీ ఇష్టం వచ్చినట్టు చేస్తామంటే కుదరదు అంటూ ఎంపీపీ బెదిరించారు. ప్రభుత్వ కార్యక్రమమని, అందుకే ఇక్కడ నిర్వహిస్తున్నామని, ఇందులో తప్పేముందని సివిల్ సప్లయ్ అధికారి చెప్పగా ఎంపీపీ మరింత బిగ్గరగా కేకలు వేస్తూ హల్‌చల్ చేశారు. తన్నెందుకు ఆహ్వానించలేదంటూ చిందులు తొక్కారు. ఎన్నికల కోడ్ కారణంగా పిలవలేదని అధికారి వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా వినిపించుకోకుండా గలాటా కొనసాగించారు. తర్వాత వైస్ ఎంపీపీ మాట్లాడుతూ అధికారులను మరింత అమర్యాదగా ప్రస్తావించారు. వ్యవసాయ శాఖ ఏవో గోకుల కృష్ణ వైపు వేలు చూపిస్తూ మాట్లాడినంతసేపు నువ్వు నువ్వు అని ఏకవచనాన్నే వాడారు. వైస్ ఎంపీపీని పిలవాలని తెలీదా, అసలు ఈ సదస్సుకు నీకు సంబంధం ఏమిటీ.. నా గురించి నీకు తెలీదనుకుంటా...నీ సంగతి తేలుస్తా..నేనేంటో తెలిసేలా చేస్తా..నీ ప్రవర్తన నాకు నచ్చలేదు జాగ్రత్త అంటూ వీరంగం సృష్టించారు. దీంతో సదస్సుకు హాజరైన వారంతా బిత్తరపోయారు. వీరి ధోరణి మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



వ్యవసాయాధికారి గోకులకృష్ణతో వాగ్వాదం చేస్తున్న వైస్ ఎంపీపీ ఈశ్వరరావు

వేతనాలివ్వండి

● 104 సిబ్బంది డిమాండ్

సీతానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని తహసీల్దార్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేద ని, దీంతో కుటుంబాలను పోషించడం చాలా కష్టమవుతుందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నడిపించాలని, 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో 104 సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఈశ్వరరావు, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కురుపాం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని రాష్ట్రీయ బాలల సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం అధికారి పీఎల్ రఘుకుమార్ అన్నారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులు ఆరోగ్యంపై వైద్య సిబ్బందికి, హెచ్ఎం రామగోవిందను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థి మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా హాస్టల్, వంట గది, మెనూ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ నిలుపుదల

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కురుపాం, గుమ్మలక్ష్మీపురం ట్రాన్స్‌కో ఏఈలు రాజేంద్రప్రసాద్, గోపాల రావునాయుడు గురువారం తెలిపారు. కురు పాం నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు 33 కేవీ లైన్ జంగిల్ క్లియరెన్స్ విద్యుత్ మరమ్మతులు చేస్తామన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం, కేదారిపురం, మొండెంకల్లు ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉంటుందని చెప్పారు.

● పాలకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నవగాం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజేకే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవగాం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ నవగాం టౌన్ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నవగాం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని చెప్పారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించి, సంస్థకు పేరు తీసుకురావాలని మన్యం జిల్లా డిపో మేనేజర్ దుర్గా అన్నారు. గురువారం స్థానిక డిపోలో డ్రైవర్ల వారం రోజుల హ్యాపీ వీక్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. వారం రోజుల శిక్షణలో 'బస్సు మీది, మనందరిది' అన్న నినాదంతో డ్రైవర్లకు అవగాహన కల్పించామని చెప్పారు. బస్సు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే డ్రైవర్లు స్పందించి మెకానిక్‌లను సంప్రదించాలన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

పాచిపెంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గూడు లేని నిరుపేద కుటుంబానికి మీకై మేము సంస్థ చేయూతనిచ్చింది. పాచిపెంట బీసీ కాలనీ సమీపంలో ఉన్న ఎరుకుల వీధికి చెందిన గొర్లె సంగమ్మ ఒంటరిగా జీవిస్తోంది. ఆమె సిమెంటు ఇటుక గోడలతో ఉన్న ఒక చిన్న గదిలో ఉంటోంది. పైకప్పు లేకపోవడంతో ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న సాలూరుకు చెందిన మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ దాతల సహాయంతో సంగమ్మ ఇంటికి రేకులు వేసి ఉదారత చాటుకుంది. ఈ కార్యక్రమంలో ఇప్పిలి దిలీప్‌కుమార్, మీకై మేము సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతన్నకు కష్టం

పార్వతీపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతులకు కష్టాలను తెచ్చి పెట్టింది. బుధవారం రాత్రి అకస్మాత్తుగా పార్వతీపురం, కొమరాడ తదితర ప్రాంతాల్లో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీనివల్ల కోసిన వరి పంట తడిచి ముద్దయిన పరిస్థితి జిల్లాలోని పార్వతీపురం తదితర ప్రాంతాల్లో ఏర్పడింది.

భూ సర్వే పక్కాగా నిర్వహించాలి

వీరఘట్టం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తహశీల్దార్ కార్యాలయంలో గురువారం పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సర్వే పక్కాగా నిర్వహించాలని, ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు పరిశీలించాలని సూచించారు. గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మణనాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కో కన్వీనర్‌గా భానోజీ

సాలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కో-కన్వీనర్‌గా సాలూరుకు చెందిన గొర్లె భానోజీని నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ సంధ్య గజపతిరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో చెరువులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. తమ సంస్థ రాష్ట్ర, జిల్లా నేతల మార్గదర్శకంలో చెరువుల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణపై సలహాల సేకరణ

పార్వతీపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు ఎమ్మెల్యేల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం స్థానిక విలేకర్లకు ఫోన్‌లో తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కొన్ని సలహాలు అందించామని ఎమ్మెల్యే చెప్పారు.